


RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ మంగళవారం 23-07-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 192 పేజీలు : 4 వెల : రూ 2-00

## పోలీసుల అదుపులో తొమ్మిది మంది

### మారణాయుధాలు స్వాధీనం

రంగారెడ్డి,అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్బర్ హిల్స్ కాలనీలో 9 మంది వ్యక్తులను అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. అక్బర్ హిల్స్ కాలనీలోని ఒక ఒక ప్లాట్ లో మారణాయుధాలు కలిగి ఉన్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. అరెస్టు అయిన వ్యక్తుల వద్ద మూడు కత్తులు రెండు పీస్టల్స్ ఒక గొడ్డలితో పాటు పలు పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎమ్మార్పీఎస్ నేత నరేందర్ కిడ్నాప్ వ్యవహారంలో ప్రమేయం ఉన్న ఇద్దరు నిందితులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పట్టుబడ్డ వ్యక్తులు రౌడీషీటర్లు కూడా అయ్యుండవచ్చని పోలీసులు భావిస్తున్నారు

# సభలో విపక్షాలు సమయాన్ని వృధా చేస్తున్నాయ్

**సమస్యలను ప్రస్తావించకుండా అడ్డుకునే యత్నాలు**
**బడ్జెట్ సమావేశాలు సజావుగా సాగాలని ఆకాంక్ష : మోడీ**



న్యూఢిల్లీ,జూలై22(ఆర్ఎన్ఎ): కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన తరువాత ఎన్డీయే సర్కార్ తొలి బడ్జెట్‌ను మంగళవారం ప్రవేశపెట్టబోతోంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మీడియాతో మాట్లాడారు. పార్లమెంటు విలువైన సమయాన్ని ప్రతిపక్షాలు వృథా చేస్తున్నాయని ఆయన విమర్శించారు.'నేను బరువెక్కిన హృదయంతో చెబుతున్నా... కొందరు ఎంపీలు, ఇతరులను తమ నియోజకవర్గ సమస్యలపై సభలో మాట్లాడే సమయం ఇవ్వకుండా చేస్తున్నారు. రాజకీయ విభేదాలను పక్కనబెట్టి నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలి. సభలో నిరసనలు చేయడమే పనిగా పెట్టుకున్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని రాజ్యాంగ విరుద్ధంగా నిశ్శబ్దం చేసేందుకు ప్రయత్నించారని మోదీ అన్నారు. ఇదివరకు జరిగిన సభల్లో రెండున్నర గంటలు నాపై ప్రతిపక్షాలు నోటికొచ్చినట్లు మాట్లాడాయి. ప్రజాస్వామ్య సంప్రదాయాల్లో ఇలాంటి వ్యాఖ్యలకు తావుండదు. వీటన్నింటినీ దేశం నిశితంగా పరిశీలిస్తోంది. విపక్షాలు నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలి. కనీసం ఈ సమావేశాలైనా సజావుగా సాగుతాయని ఆశిస్తున్నా. 2014 తర్వాత కొంతమంది ఎంపీలు ఒకసారి, మరికొందరు రెండోసారి గెలిచారని అన్నారు. కానీ.. విపక్షాల అరుపుల మధ్య వారిలో చాలా మంది వారి సమస్యలను సభాసాక్షిగా వినిపించలేక పోయారు. ఇక నుంచైనా సమావేశాలను సజావుగా సాగనిస్తూ.. ప్రజల ఆకాంక్షలను సభలో వినిపించనివ్వండి. 60 సంవత్సరాల తరువాత వరుసగా మూడు సార్లు ఓ పార్టీ అధికారంలోకి రావడం ఇదే తొలిసారి. మూడోసారి అధికారం చేపట్టాక తొలి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నాం అని మోదీ వ్యాఖ్యానించారు. సుపరిపాలనకు ఈ బడ్జెట్ ముఖ్యమైనది. రాబోయే 5 ఏళ్లకు ఇది దిశానిర్దేశం చేస్తుంది. 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి బలమైన పునాది అవుతుంది. గత మూడేళ్లలో దేశం 8 శాతం ఆర్థిక వృద్ధిని సాధించింది. దేశంలో పెట్టుబడిదారులకు సానుకూల వాతావరణం ఉంది. అందుకు తగినట్లు వేల సంఖ్యలో కంపెనీలు భారత్‌కి వచ్చి పెట్టుబడులు పెడుతున్నాయ్. లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నాయ్' అని మోదీ పేర్కొన్నారు.

# దేశ ఆర్థిక వృద్ధి 6.5 నుంచి 7 శాతం

**2026 నాటికి ధరల సూచిని 4.1 శాతానికి తగ్గించే లక్ష్యం**
**కల్తీ, అనారోగ్యకరమైన ఆహారమే వ్యాధులకు కారణం**
**అంచనా వేసిన ఆర్థిక సర్వే..పార్లమెంట్‌కు సమర్పణ**



న్యూఢిల్లీ,జూలై22(ఆర్ఎన్ఎ): కేంద్ర బడ్జెట్ 2024..ప్రవేశపెట్టే ముందు.. ఆర్థిక సర్వేను పార్లమెంట్ లో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టారు. తేదీ లోక్ సభలో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో చాలా కీలకమైన అంశాలు ఉన్నాయి. దేశ ఆర్థిక వృద్ధి 6.5 నుంచి 7 శాతంగా ఉంటుందని అంచనా. మార్కెట్ అంచనాలు చాలా ఎక్కువగా ఉన్నాయని.. అందుకు తగ్గట్టుగా రిస్క్ ఎక్కువగా ఉంటుందని.. అయినా వృద్ధి రేటును కొనసాగుతుందని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. ద్రవ్యోల్బణం.. ధరల సూచి 4.5 శాతంగా ఉంటుందని.. 2026 నాటికి ధరల సూచిని 4.1 శాతానికి తగ్గించటమే లక్ష్యంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.దేశంలోని ప్రజలు 54 శాతం వ్యాధులు, రోగాలకు కల్తీ, అనారోగ్యకరమైన ఆహారమే కారణం అని.. ఈ విషయంలో మార్పు అవసరం అని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. సమతుల్యమైన ఆహారం, నాణ్యమైన ఆహారం వైపు మార్పు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్థిక సర్వే చెబుతోంది. చైనా నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు భారీగా పెరిగినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. దీని వల్ల దేశం నుంచి ఇతర దేశాలకు ఎగుమతులు పెంచటానికి ఈ పెట్టుబడులు ఎంతో ఉపయోగపడతాయని స్పష్టం చేసింది ఆర్థిక సర్వే. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్..ప్రభావం ఉద్యోగులు, కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. పప్పు ధాన్యాల లోటు కొనసాగటం వల్ల.. దిగుమతులు తప్పవు అనేది స్పష్టం చేసింది ఆర్థిక సర్వే. దేశంలోని బ్యాంకింగ్, ఆర్థిక రంగాలు అద్భుతమైన పనితీరు చూపించటంతో.. ఆర్థిక ఒడుదుడుకులను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు ఆర్థిక సర్వే స్పష్టం చేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభాలు, దేశంలోని క్లిష్టమైన ఆర్థిక రంగాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే స్థానిక ఉత్పత్తులు, వినియోగం ద్వారానే అడ్డుకట్ట వేయొచ్చని అభిప్రాయపడింది ఆర్థిక సర్వే. దీంతో పాటు గణాంక అనుబంధాన్ని కూడా సభలో ప్రవేశపెట్టారు.బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఈ ఎకనమిక్ సర్వే. ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన ఎకనామిక్ అఫైర్స్ డిపార్ట్‌మెంట్‌లోని ఎకనమిక్ డివిజన్ ఈ సర్వేను రూపొందిస్తుంది. తొలుత 1950-51 సంవత్సరం నుంచి ఆర్థిక సర్వేను బడ్జెట్‌తో పాటే ప్రవేశపెట్టేవారు. 1960 తర్వాత బడ్జెట్‌కు ఒక రోజు ముందు ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది. అంతర్జాతీయ భౌగోళిక పరిణామాలు, వాటి ప్రభావం ఆర్‌బీఐ ద్రవ్య విధాన నిర్ణయాలను ప్రభావితం చేయొచ్చు. ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. కార్పొరేట్, బ్యాంకింగ్ బ్యాలెన్స్ షీట్స్ బలంగా ఉన్నాయి. ప్రైవేటు పెట్టుబడుల వృద్ధికి ఇది దోహదం చేస్తుంది. భారత వృద్ధిలో క్యాపిటల్ మార్కెట్‌లది కీలకపాత్ర. భౌగోళిక రాజకీయ, ఆర్థిక పరిణామాలను తట్టుకోలదని ఆర్థిక సర్వే అభిప్రాయం.

# భద్రాచలం వద్ద గోదావరి నది ఉధృతం

**రెండో ప్రమాద హెచ్చరిక చేరువలో ప్రవాహం**
**సహాయక చర్యలకు సిద్ధంగా అధికారయంత్రాంగం**

భద్రాచలం,జూలై22(ఆర్ఎన్ఎ): భద్రాచలం వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో మొదటి ప్రమాద హెచ్చరికను దాటి ఉరుకులు పెడుతున్నది. సోమవారం ఉదయం 46.80 అడుగులకు చేరింది. మరో రెండు అడుగులు దాటితే రెండో ప్రమాద హెచ్చరిక జారీచేయనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. ఆదివారం రాత్రి భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం 44 అడుగులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేసిన విషయం తెలిసిందే. అయితే ఎగువన ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో నది ఉగ్రరూపం దాల్చింది. సోమవారం నదీ ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు వెల్లడించారు. అదేవిధంగా ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదారమ్మ మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తున్నది. మొదటి ప్రమాద హెచ్చరిక 14.830 మీటర్లు కాగా, ప్రస్తుతం 15.130 మీటర్లు వుంది. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రతగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.భద్రాద్రి జిల్లాలో ఉన్న రెండు ప్రాజెక్టులకు వరద నీరు చేరింది. కిన్నెరసానిలో 16 వేల క్యూసెక్కుల నీటిని బయటకు వదలిపెట్టారు. 407 అడుగుల నీటి సామర్థ్యానికి గాను ప్రస్తుతం 403.30 అడుగులు నీటిమట్టం ఉంది. సాయంత్రానికి ఆరు గేట్లు ఎత్తివేశారు. చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టులో మొత్తం 25 గేట్లను ఎత్తి 92,121 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. గోదావరి వరద ప్రభావం వల్ల అక్కడ ఈతవాగు పొంగడంతో గుంపల్లి చర్ల గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. పర్ణశాలలో సీతవాగు పొంగి ప్రవహిస్తోంది. దుమ్ముగూడెం మండలంలో గుబ్బలమంగి ప్రాజెక్టులో భారీగా వరదనీరు చేరడంతో సున్నంబట్టి, కాశీనగరం గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. దీంతో అధికారులు అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.భద్రాచలం వద్ద గోదావరి వరద 73 అడుగుల స్థాయిని తాకితే పరీవాహక ప్రాంతాల్లో 109 గ్రామాలు, భద్రాచలం పట్టణం ముంపునకు గురవుతాయని నీటిపారుదలశాఖ ప్రకటించింది. 48 అడుగుల స్థాయి నుంచే పలు గ్రామాలకు ముప్పు మొదలవుతుందని సూచించింది. 48 అడుగుల స్థాయి నుంచే పలు గ్రామాలకు ముప్పు మొదలవుతుందని సూచించింది. ఈ నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఏ మట్టం స్థాయిలో ఏ గ్రామం ప్రభావితమవుతుందనే వివరాలను నీటిపారుదలశాఖ పోర్టల్లో ఉంచినట్లు ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ తెలిపారు. గోదావరి, కృష్ణా పరీవాహకాల్లోని ప్రాజెక్టుల వద్ద ఇంజినీర్లను అప్రమత్తం చేశామన్నారు. అశ్వారావుపేట మండలంలో వరదలకు కొట్టుకుపోయిన పెద్దవాగు ప్రాజెక్టు నిర్వహణ విషయంలో అలసత్వం వహించిన ఇంజినీర్లపై చర్యలకు నీటిపారుదలశాఖ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కొత్తగూడెం సర్కిల్ సీఈ శ్రీనివాసరెడ్డి పంపించిన నివేదిక ప్రకారం ఈఈ, డీఈఈ, ఏఈఈలపై చర్యలకు ఈఎన్సీ అనిల్‌కుమార్ ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఒకటి రెండు రోజుల్లో క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.



# తెలుగు రాష్ట్రాల్లో పొంగుతున్న వాగులు


**గోదావరికి ఉధృంతగా వరదనీరు**
**పరీవాహకాల్లోని ప్రాజెక్టుల్లో జలకళ**
**శ్రీశైలానికి ఉరకలెత్తుతున్న కృష్ణా ప్రవాహం**
**గోదావరి వరదపై మంత్రి పొంగులేటి సమీక్ష**





విజయవాడ/హైదరాబాద్,జూలై22(ఆర్ఎన్ఎ): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రధాన నదులు కృష్ణా, గోదావరులు పొంగుతున్నాయి. ప్రధానంగా గోదావరికి వరద పోటెత్తుతోంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గత మూడు రోజులుగా ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరుల నుంచి వరద వచ్చి చేరుతోంది. తెలంగాణలోని గోదావరి పరీవాహకం లోనూ భారీ వర్షాలు పడుతుండటంతో కిన్నెరసాని, ముర్రేడు, కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ-అన్నారం బ్యారేజీల మధ్య వాగుల నుంచి పెద్దఎత్తున వరద వచ్చి గోదావరి నదిలో కలుస్తోంది. దీంతో ప్రవాహం పెరుగుతోంది. మేడిగడ్డ వద్ద 5.52 లక్షల క్యూసెక్కుల వరద ప్రవహిస్తోంది. అన్నారం బ్యారేజీకి 16,850 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండడంతో 66 గేట్లు ఎత్తి అదేస్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. ఇంద్రావతి కలిసిన అనంతరం సమ్మక్క బ్యారేజీ వద్ద 8.23 లక్షల క్యూసెక్కులు, దుమ్ముగూడెం సీతమ్మసాగర్ ఆనకట్ట వద్ద 9.01 లక్షల క్యూసెక్కుల ప్రవాహంతో గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి(43 అడుగులు)ని నది దాటింది. నదీ పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గక పోవడంతో మరికొంత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో శ్రీరామసాగర్ జలాశయంలోకి ఎగువ నుంచి 18,518 క్యూసెక్కుల వరద చేరుతోంది. నిర్మల్ జిల్లాలోని కడెం నారాయణరెడ్డి జలాశయంలో ఆదివారం ఉదయం నాలుగు వరద గేట్లు ఎత్తారు. మధ్యాహ్నానికి వరద తగ్గడంతో ఒక గేటు మూసేసి మూడు గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. కృష్ణా నదిలో ఎగువన వరద పెరుగుతోంది. కర్ణాటకలో ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాల కింద అప్రమత్తత ప్రకటించారు. ఆదివారం సాయంత్రానికి ఎగువ నుంచి భారీ ప్రవాహాలు వస్తుండటంతో ఆలమట్టి నుంచి దిగువకు 1.50 లక్షల క్యూసెక్కుల నీటి విడుదలను ప్రారంభించారు. ఇది మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు కర్ణాటక జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. నారాయణపూర్ నుంచి 25 గేట్లు తెరిచి 1.45 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. దీంతో జూరాలకు వరద పెరిగింది. ప్రాజెక్టు 22 గేట్లను తెరిచారు. శ్రీశైలం జలాశయం వద్ద 96 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి నది పరీవాహకంలోని లోతట్టు ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టాలని పరీవాహక జిల్లాల కలెక్టర్లను రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. వరద పరిస్థితులపై ఆదివారం హైదరాబాద్‌లో అధికారులతో ఆయన సమిక్ష నిర్వహించారు. నదులు, వాగుల ప్రవాహాలతో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్దేశిరచారు. కలెక్టరేట్లలో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసి.. సమన్వయం చేయాలని కోరారు. రెస్క్యూ బృందాలు, ఎన్డీఆర్ఎఫ్ బృందాల సాయాన్ని తీసుకోవాలని సూచించారు.

# డబ్బున్నోళ్లు విద్యా వ్యవస్థను కొనేస్తున్నారు: రాహుల్‌గాంధీ



ఢిల్లీ: నీట్ పేపర్ లీకేజీ విషయంలో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ మండిపడ్డారు. పార్లమెంట్ సమావేశాలలో నీట్ పేపర్ లీకేజీపై చర్చ సందర్భంగా రాహుల్ మాట్లాడారు. డబ్బున్నోళ్లు విద్యా వ్యవస్థను కొనేస్తున్నారని, నీట్ పేపర్ లీక్ పెద్ద సమస్యగా మారిందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తనను తప్ప అందరినీ తప్పుపడుతున్నారని రాహుల్ చురకలంటించారు.నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిఎంకె ఎంపి కళానిధి వీరస్వా డిమాండ్ చేశారు. నీట్ పరీక్షకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ ఎంపి మాణిక్యం ఠాగూర్ తెలిపారు.

# మేడిగడ్డ వద్ద భారీగా వరదనీరు

**గోదావరి పరివాహకంలో సీతక్క పర్యటన**

జయశంకర్ భూపాలపల్లి/ములుగు,జూలై22(ఆర్ఎన్ఎ):జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండల పరిధిలోని అంబట్‌పల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ బరాజ్‌కు వరద ప్రవాహం పోటెత్తుతోంది. తెలంగాణతో పాటు ఎగువన ఉన్న మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండటంతో గోదావరి నదులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సోమవారం బరాజ్ ఇన్‌ఫ్లో 8,68,850 క్యూసెక్కులకు పెరిగింది. బ్యారేజీలో 85 గేట్లు ఎత్తి 8,68,850 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అదేవిధంగా అన్నారం బరాజ్‌కు 17,200 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతున్నది. భారీ వర్షాల నేపథ్యంలో నదీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లతున్నాయి. ప్రాజెక్ట్‌లు జలకళలను సంతరించుకుంటున్నాయి. వరద నీటి తీవ్రతకు పలుచోట్ల రహదారులు కొట్టుకుపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

# సంపాదకీయం

మంగళవారం 23-07-2024

## బడ్జెట్ సామాన్యులకు చిక్కేనా ?

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఓట్ ఆన్ అకౌంట్ తరవాత ఎన్నికలు..ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత పూర్తిస్థాయి బడ్జెట సమావేశాలు మొదలయ్యాయి. ప్రజలు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్న అనేక అంశాలకు, సమస్యలకు పార్లమెంట్ జవాబుదారీ కావాలి. ప్రజలకు తాము అండగా ఉన్నామన్న సంకేతం వెళ్లాలి. అప్పుడే ప్రజలకు విశ్వాసం కలుగుతుంది. ఇకపోతే దేశానికి దశాదిశానిర్దేశం చేసేలా బడ్జెట్ పద్దులు ఉండాలి. బడ్జెట్ అనగానే దేశ అభివృద్ధి ముఖచిత్రం కనిపించాలి. అంకెలా గారడీ కాకుండా దేశాన్ని నిలబెట్టేలా, ఆపన్నులను ఆదుకునేలా, భవిష్యత్ దర్శనం చూపేలా ఉండాలి. కానీ ఏటా మొక్కుబడి బడ్జెట్ ప్రసగాలు సాగుతున్నాయి. గత పదేళ్లలో ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న వారికి ఏ రకంగానూ బడ్జెట్‌లో ఏరడింపు కలగలేదు. ఈ క్రమంలో మంగళవారం ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌పై దేశ ప్రజల్లో సహజంగానే ఆసక్తి కలుగుతోంది. గత పదేళ్లకు భిన్నంగా బడ్జెట్ ఉ ంటుందా అన్న ఆసక్తి, ఉత్కంఠ కూడా కలుగుతోంది. తొలిసారి సంకీర్ణంలోకి అడుగుపెట్టిన మోడీ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న తొలి బడ్జెట్ కావడంతో విపక్షాలతో సహా, అన్ని తరగతుల ప్రజలు కూడా గతంలో ఎప్పుడూ లేనంతగా ఆసక్తి కనబరు స్తున్నారు. దీంతో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టే బడ్జెట్‌పై సర్వత్రా చర్చ సాగుతోంది. ఇకపోతే దేశ ప్రజలంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏడోసారి కేంద్రబడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యారు. అంతకుముందు పార్లమెంటులో ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టనున్నారు. నిర్మలా సీతారామన్ పేరిట వరుసగా ఏడు బడ్జెట్‌లు సమర్పించిన రికార్డు నమోదు కానుంది. ఇప్పటి వరకు ఈ రికార్డు మొరార్జీ దేశాయ్ పేరిట ఉంది. బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు నిర్మలా సీతారామన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక వ్యవస్థలోని వేర్వేరు వాటాదారులతో చాలాసార్లు చర్చలు జరిపింది. విద్య, ఆరోగ్య రంగం, క్యాపిటల్ మార్కెట్, ఉపాధి, నైపుణ్యాలతో పాటు రంగాలకు చెందిన అధికారులు, ప్రతినిధులతో చర్చలు జరిపారు. పలువురు ఆర్థికవేత్తలతోనూ ఆర్థిక మంత్రి సమావేశమయ్యారు. బడ్జెట్‌లో ద్రవ్యలోటు తగ్గింపుపై దృష్టి సారించాలని ఆర్థికవేత్తలు కేంద్రానికి సూచించారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని రైతు సంఘాలు ఆర్థిక మంత్రిని కోరాయి. ఇకపోతే ఈసారి కేంద్ర బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యత దక్కాలని ఈ రెండు రాష్ట్రాలు కోరుకుంటున్నాయి. రెండు రాష్ట్రాల సిఎంలు పలుమార్లు కేంద్రమంత్రులను కలిసి ఇప్పటికే వివిధ అంశాలపై వినతులు సమరపించారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కీలక భాగస్వామిగా ఉ న్న టీడీపీ.. ఏపీ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు, ప్రాజెక్టులు కేటాయించాలని కేంద్రాన్ని కోరుతోంది. ఈ క్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రధాని మోదీ సహా కేంద్ర పెద్దలను కలిసి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోనూ ఈసారి బీజేపీ ఎక్కువ సీట్లు గెలుచు కోవడంతో.. రాష్ట్రానికి గతానికంటే ఎక్కువ లబ్ది చేకూరేలా నిర్ణయాలు ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. గతంలో లాగానే బడ్జెట్ 2024 కూడా పేపర్‌లెస్ ఫార్మాట్‌లో ఉండనుంది. బడ్జెట్ పత్రాలు హిందీ, ఇంగ్లీష్ మాత్రమే అందుబాటులో ఉంటాయి. కేంద్ర బడ్జెట్‌కు సంబంధించిన అన్ని పత్రాలు 'యూనియన్ బడ్జెట్ మొబైల్ యాప్'లో అందుబాటులో ఉంటాయి. దీంతో పార్లమెంట్ సభ్యులు, సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బడ్జెట్ పత్రాలు అందుతాయి. బడ్జెట్ సమర్పించిన కొద్దిసేపటికే అన్ని పత్రాలు ఈ యాప్‌లో అందుబాటులోకి రానున్నాయి. ఈ సారి బడ్జెట్ లో కేంద్రం ప్రజాకర్షక విధానాలవైపే మొగ్గుచూప బోతున్నట్టు తెలిసింది. ఆదాయపన్నుల్లో ఉపశమనం, కిసాన్ సమ్మాన్ నిధి, ఇళ్ల నిర్మాణాలకు ఊతమిచ్చే విధంగా నిర్ణయాలు ఉండబోతున్నట్లు తెలిసింది. మరోవైపు ఆదివారం అఖిలపక్ష స మావేశం జరిగింది. ఇందులో సంఘటిత ప్రతిపక్షాలు పలు కీలక విషయాలను ప్రభుత్వం ముందుంచాయి. విపక్షం బలంగా ఉండడం వంటి కారాణాల వల్ల పార్లమెంట్ సమావేశాల్లో ఇక దాటవేత ధోరణి కుదరదు. ప్రత్యేకించి నీట్ వివాదం, పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజ్ వంటి విషయాలపై సభలలో చర్చకు అవకాశం ఇవ్వాల్సిందే అని ప్రతిపక్షాలు అఖిలపక్షంలో పట్టుపట్టాయి. అనుకున్నట్లుగానే తొలిరోజే అంటే సోమవారమే దీనిపై విపక్ష నేత రాహుల్ ప్రస్తావించారు. చర్చకు పట్టుబట్టారు. అలాగే అనేకమైన ప్రజల అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. బడ్జెట్‌తో పాటు, ప్రజా సమస్యలపై సహేతుకమైన సమాధానం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉండాల్సిందే. గతంలో లాగా వాయిదాలు వేయడం,దాటవేయడం, ఎంపిలను సస్పెండ్ చేయడం లాంటి చర్యలు కదరవని గుర్తించాలి. ఇక ప్రభుత్వానికి కూడా సభా నిర్వహణలో అందరి మద్దతు అవసరం. అన్ని అంశాలపై చర్చకు తాము సిద్ధం అని అఖిలపక్షంలో కేంద్రమంత్రులు వెల్లడించారు. అయితే ఏదైనా కూడా సభా నిబంధనలకు అనుగుణంగా ఉంటుందని తెలిపారు. వీటిని అంతా పాటించాల్సిందేనని ప్రతిపక్ష నేతలకు కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. సభ అందరిదీ, సమిష్టి సహకార వైఖరితోనే నిర్ణీత రీతిలో సభలు నిర్వహించేందుకు వీలుంటుందని స్పష్టం చేశారు. అదే సమయంలో విపక్షాలు కూడా సమర్థంగా పనిచేయాల్సి ఉంటుంది. కేవలం గొడవలు సృష్టించేందుకు కాకుండా ఉమ్మడిగా సమస్యలపై చర్చించి ప్రభుత్వాన్ని నిలదీయగలగాలి. ఏదేమైనా సమావేశాలు అన్నవి ప్రజలకు సంబంధించినవిగా అటు ప్రభుత్వం, ఇటు విపక్షం గుర్తించాలి. ఇవి తమ ప్రతిష్టకు సంబంధించినవిగా చూడరాదు. ప్రతిష్టకు, పంతాలకు కూడా ఇది సమయం కాదు. ప్రజల సమస్యలపై పార్లమెంట్ జవాబుదారీగా వ్యవహరించాలి. గతంకన్నా భిన్నంగా సభ సాగిందన్న పేరు రావాలి. అప్పుడే దేశంలో నాయకులపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం బలపడుతుందని గుర్తించాలి.

## నిషేధిత 740 గ్రాముల ఎండు గంజాయి పట్టివేత

**జులాయి లపై డేగ కన్ను**
**మత్తు పదార్థాలపై ఉక్కు పాదం**
**కామారెడ్డి పట్టణ సిఐ చంద్రశేఖర్ రెడ్డి**
**నిందితుడు రిమాండ్**

కామారెడ్డి జిల్లా (లోకంతీరు) జూలై 22జులాయి లపై డేగ కన్ను తో పర్యవేక్షిస్తున్నట్లు కామారెడ్డి పట్టణ సిఐ చంద్రశేఖర్ రెడ్డి సోమవారం అన్నారు.కామారెడ్డి పట్టణంలో అశోక్ నగర్ కాలనీ చెందిన కుంభాల రాజేష్ యాదవ్ అనే వ్యక్తి గత కొంతకాలం నుండి నిషేధిత గంజాయిని హైదరాబాదు, చుట్టుపక్కల ప్రాంతాల నుండి తీసుకువచ్చి కామారెడ్డి పట్టణంలో అతనికి తెలిసిన వారికి, స్నేహితులకు, ఇతరులకు అమ్ముతూ జులాయిగా తిరుగుతున్నాడు. అయితే ఇతని కదలికలపై అనుమానంతో, సరైన సమాచారంతో సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు కామారెడ్డి బస్టాండ్ వద్ద ఎస్ఐ రాజారాం సిబ్బంది. రాజేష్ యాదవ్ ని పట్టుకోగా, అతని వద్ద సుమారు 740 గ్రాముల ఎండు గంజాయి పట్టుకుని, పీఎస్ కి తీసుకువచ్చి విచారణ చేయగా, చేసిన నేరాన్ని అంగీకరించినట్లు సిఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో దాదాపుగా ఏడు నుంచి ఎనిమిది కేసులలో నేరస్తుడిగా ఉన్నాడు.గంజాయి స్వీకరించిన ఎక్కడ నుండి గంజాయి కొనుక్కొని వచ్చిన విషయాలు తదుపరి విచారణలో పూర్తిస్థాయిలో తెలుపుతామని అన్నారు. సోమవారం అరెస్టు అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరిసి జైలుకు పంపమన్నారు, మీకు పరిచయం ఉన్న వ్యక్తులకు గాని, లేదా మన కుటుంబ సభ్యులకు గానీ గంజాయి కి సంబంధించిన ఏమైనా చెడు అలవాట్లు ఉంటే, వెంటనే వాటిని మాన్పించాల్సిందిగా, వారికి సరైన కౌన్సిలింగ్ ను ఇప్పించాల్సిందిగా, గంజాయి అమ్మిన వారి సమాచారం గానీ లేదా ఎవరైనా మనకు తెలిసిన గంజాయిని అమ్ముతున్నారని లేదా కొంటున్నారని తెలిసినా వెంటనే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలన్నారు. కామారెడ్డి పట్టణంలో చుట్టుపక్కల ప్రాంతాలలో, కామారెడ్డి జిల్లాలో గంజాయి ని నిర్మూలించడానికి అవకాశం ఉంటుందని ప్రజలకు సూచించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి


**సిఐటియు డిమాండ్ - సిఐటియు నాయకుడు ప్రభాకర్**




కామారెడ్డి జిల్లా (లోకంతీరు) జూలై 22 కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధాలు మానుకోవాలని సిఐటియు ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆశ వర్కర్లకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆశా వర్కర్లు కామారెడ్డి కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా చేయడం తిరిగిందని, ఆశ వర్కర్ జిల్లా అధ్యక్షురాలు ఇంద్ర ,జిల్లా కార్యదర్శి రాజశ్రీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ వర్కర్ పర్మినెంట్ చేస్తానని మోనో పోస్ట్ లో పెట్టడం ఆశ వర్కర్లను అవమానించడం అన్నారు. ప్రజా పాలన పేరు తోటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటుతున్న ఆశా కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని, ఆశ వర్కర్ల పట్ల చిన్న చూపు చూస్తుంది కనీస గౌరవ వేతనం 18000 రూపాయలు ఇవ్వాలని, పి ఎఫ్, ఈఎస్ఐ, సౌకర్యం కల్పించాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆశాలతో అదనంగా పనులు చేయించవద్దని అధికారుల ఒత్తిళ్లు మానుకోవాలని ఆశ వర్కర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి 5 లక్షలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆశ వర్కర్లు 24 గంటలు పని చేస్తున్న వారికి అదనంగా బత్యం చెల్లించాలని,కరోనా టైంలో ప్రజలంతా ఇంట్లోకి పరిమితమైన ఆశ వర్కర్లు మాత్రం ప్రజలకు సేవ చేసి ప్రజలను కాపాడిన చరిత్ర గుర్తించి ఇండియన్ గ్లోబ్ సంస్థ పంచ ఆరోగ్య ఆశా వర్కర్లకు అవార్డు ప్రకటించిందని గుర్తు చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆశ వర్కర్ల పట్ల చిన్నచూపు చూస్తున్నాయి. ఇప్పటికైనాఆశ వర్కర్లు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సిఐటియూ గా ఆధ్వర్యంలో పోరాటాలు, చేస్తామని ప్రభుత్వం బాధ్యత వహించవలసి ఉంటుందని వారి డిమాండ్ చేశారు.ఈ కార్యకర్తలో నాయకులు మంజుల. పద్మ. రేణుక. గంగామణి. సుధా. భాగ్యలక్ష్మి. ప్రమీల. లలిత 350 మంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు


## వెన్ను చూపని మన్నెం వీరుడు..

**గాం గంటందొర**
**గుమ్మడి లక్ష్మీనారాయణ,**
**ఆదివాసీ రచయితల వేదిక**



కామారెడ్డి జిల్లా (లోకంతీరు) జూలై 22భారత స్వాతంత్ర్య పోరాటంలో చిరస్మరణీయులైన వీరుల్లో గంటందొర ఒకరు. బాహ్య ప్రపంచానికి తెలియక మరుగున పడిన పోరాట వీరుల్లో ఆదివాసీ యోధులే ఎక్కువ. విశాఖ మన్యంలో బ్రిటీష్ వారితో పోరాడి అసువులు బాసిన విప్లవ వీరుల్లో గొప్ప గిరిజన ఆదివాసీ నాయకుడు గాము గంటందొర. గిరిజన బగత తెగకు చెందిన ఆయన ఇప్పటి అల్లూరి సీతారామరాజు (ప.గో) జిల్లాలో కొయ్యూరు మండలం లంకవీధిలో జన్మించాడు. బ్రిటిష్ నిరంకుశ పాలనలో గిరిజనులు అనుభవిస్తున్న దయనీయ పరిస్థితిని తొలగించి, వారి జీవితాలలో అభ్యుదయ కాంతులు నింపడానికి అల్లూరి సీతారామరాజుతో కలిసి గాము గంటందొర 1922 నుంచి 1924 వరకు 'మన్యం విప్లవం సాగించారు. అల్లూరి సీతారామరాజుకి కుడి భుజంగా ఉంటూ బ్రిటీష్ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తూ 1924 వ సంవత్సరం జూన్ 7న వలసంపేట గ్రామం వద్ద మకరం ముట్ట కాలువ పైన ఉన్న సంగధార అనే ప్రదేశంలో వీర మరణం పొందారు.×బికారి అయిన మునసబు:గాము గంటందొర గ్రామ మునసబుగా పనిచేసేవారు. ఇతనిని ప్రజలు ఎంతగానో అభిమానించేవారు. ఆయన కూడా ఎప్పుడూ గిరిజన ప్రజల సంక్షేమాన్ని, వారి అభివృద్ధిని కోరుకుంటూ వారి సర్వతోముఖాభివృద్ధికి నిత్యం కృషి చేసేవాడు. పరిపాలన వ్యవహారాలలో ఎంతో అనుభవం ఉండేది. ప్రజల మనస్తత్వం పూర్తిగా తెలిసినవాడు. ఎప్పుడూ ప్రజల పక్షంగా ఉండేవాడు. ఇది గూడెం డిప్యూటీ తహసీల్దార్ సెబాస్టియన్ కు నచ్చేది కాదు. ఎప్పుడూ గంటం దొరను ఇబ్బందులు పెడుతూ అవమానాలకు గురిచేసేవాడు. కుట్రపన్ని ప్రభుత్వ సొమ్మును కాజేశారని గంటం దొరపై నిందలు వేసి మునసబు పదవి నుంచి తప్పించేశాడు. బ్రిటిష్ ప్రభుత్వం దుర్మార్గంగా ఆయన భూములను, ఎడ్లను జప్తు చేసింది. చివరకు ఆయన ఇంటిని కూడా ఆక్రమించింది. న్యాయ మార్గాన్ని నమ్ముకున్న గంటందొరకు తీవ్ర అన్యాయం జరిగింది. దానితో వీరి కుటుంబం పూర్తిగా పేదరికంలో కూరుకుపోయింది. దీంతో తమకు జరిగిన అన్యాయంపై తిరుగుబాటు చేయాలని నిశ్చయించుకొని అప్పటికే ప్రభుత్వంపై పోరాటానికి సన్నాహాలు చేస్తున్న అల్లూరి సీతారామరాజుతో కలిసి మన్యం విప్లవానికి నాంది పలికారు. గంటం దొర గిరిజనులకు సుపరిచితుడుగా ఉండటం పైగా పాలన వ్యవహారాలలో పూర్తిగా అనుభవం కలిగి ఉండటం వలన అల్లూరి సీతారామరాజు 60 మంది గిరిజన పోరాటయోధులతో ఒక గెరిల్లా సైన్యాన్ని ఏర్పాటు చేసి దానికి ప్రధాన బాధ్యత గంటం దొరకు అప్పగించారు.×పోలీసు స్టేషన్లపై దాడులు:అల్లూరి, గంటందొర కలిసి మన్యంలో జరిగిన విప్లవంలో బ్రిటిష్ ప్రభుత్వాన్ని గజగజలాడించి 1922, ఆగష్టు 22న చింతపల్లి స్టేషన్ పై దాడి చేయడంతో మన్యసీమ ఉ ద్యమం ఆరంభమైనది. పోలీస్ స్టేషన్ ఆక్రమించి తుపాకులు, తూటాలు తీసుకొని వెళ్ళిపోయారు. అలాగే కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్, ఆ మరుసటి రోజు రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్లను ఆక్రమించి తుపాకులు, మందు గుండు సామగ్రి స్వాధీన పరుచుకున్నారు. మన్యం పోరాటంలో మరొక గొప్ప సంఘటన కర్కశులైన బ్రిటిష్ మిలటరీ అధికారులు స్కాట్ కవర్స్, హైటర్లను అంతం చేయడం. వారు విశాఖ జిల్లాకు వచ్చినప్పుడు అల్లూరి, గంటం దొర, సోదరుడైన మల్లుదొరల నాయకత్వంలో మన్యం వీరులు వారిని అంతం చేశారు. ఇది బ్రిటిష్ ప్రభుత్వానికి కోలుకోలేని దెబ్బ. ఆ తర్వాత అడ్డతీగల పోలీస్ స్టేషన్, రంపచోడవరం పోలీస్ స్టేషన్లను ముందుగానే ముట్టడిస్తానని మిరపకాయ టపా పంపి మరీ వశపరుచుకున్నారు. ఈ విధంగా మన్యవిప్లవంలో ముఖ్యమైన అన్ని సంఘటనలలో గంటం దొర చాలా కీలకపాత్ర పోషించారు. మన్యం పితూరిని ముందుకు నడిపేందుకు ఎవరు ఏవిధంగా పనికొస్తారో, ఎవరిని ఉద్యమంలో కలుపుకొని వెళ్ళాలి అనే విషయాలను అల్లూరి సీతారామరాజుకి గంటందొర తగిన సలహాలిచ్చే వాడు. అల్లూరి ఆలోచనా విధానాన్ని, సిద్ధాంతాలను, వ్యూహమును నూటికి నూరు శాతం అర్థం చేసుకొని మెలిగిన వ్యక్తి గంటందొర మాత్రమే. అందుకే మన్యవిప్లవం నుంచి గంటందొర జీవితాన్ని వేరుగా చూడలేం. పితూరీలు, పోరాటాలు గంటం దొర జీవితం. స్వేచ్ఛ కోసం జరిపిన గెరిల్లా పోరాటమే గంటం దొర జీవిత చరిత్ర. గిరిజన ఆదివాసీల సంక్షేమమే తన జీవిత లక్ష్యంగా, వారి కష్టాలు తీర్చడమే తన కర్తవ్యంగా పోరుబాట సాగించిన మన్యం వీరుడు గాము గంటందొర అనడం నిస్సందేహం!×అల్లూరి తర్వాత కూడా పోరుబాట వీడలేదు :అల్లూరి సీతారామరాజు మరణానంతరం కూడా బ్రిటిష్ ప్రభుత్వంపై మన్యంలో పోరాటం కొనసాగిస్తూనే బ్రిటిష్ సైన్యాన్ని ముప్పుతిప్పలు పెట్టాడు గాము గంటం దొర, ఆ క్రమంలో చివరికి 1924వ సంవత్సరం జూన్ 7వ తేదీన కృష్ణదేవిపేట దగ్గరలో ఉన్న వలసంపేట గ్రామం వద్ద మకరం ముట్ట కాలువ పైన ఉన్న సింగధార అనే ప్రదేశంలో బ్రిటిష్ సైన్యంపై వీరోచితంగా పోరాడి వీరమరణం పొందాడు గాము గంటందొర. 1922 నుండి 1924 వరకు దాదాపుగా రెండేళ్లు సాగిన మన్య పోరాటంలో, ఎందరో వీరులు తమ జీవితాలను ధారపోసి అందించిన స్వరాజ్యం మనది. ఎందరో జైలు గోడల మధ్య చిత్రహింసలు అనుభవించి, స్వాతంత్ర్యాన్ని మనకు అందించి ఎటువంటి గుర్తింపుకు నోచుకోకుండా జీవితాలు చాలించిన వీరులలో గాం గంటందొర అనామక యోధుడుగా మిగిలాడు. అలాంటి వీరులందరి త్యాగఫలమే మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు. కాబట్టి గంటందొర పోరాట చరిత్రను వెలుగులోకి తెచ్చి భావితరాలకు అందించాలి.జులై 2024: గాం గంటందొర శత వర్ధంతి.

## పంచాయతీ కార్యదర్శుల బదిలీలు







కామారెడ్డి జిల్లా జూలై 22 (లోకంతీరు)నాగిరెడ్డిపేట్ మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు బదిలీ కాగా వారి స్థానంలో నూతన కార్యదర్శులు చేరారని సోమవారం ఎంపీడీవో పర్బన్న తెలిపారు. మండలంలోని అచ్చాయిపల్లి కార్యదర్శి రమ్యశ్రీ ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల కు బదిలీ కాగా, ఎల్లారెడ్డి మండలం సోమిర్యాగడి తండా కార్యదర్శి వెంకట్ రాములు. బొల్లారం కార్యదర్శి సంతోష్ కుమార్ లింగంపేట్ మండలం కోమటి పల్లి కి బదిలీ కాగా వారి స్థానంలో ఎల్లారెడ్డి మండలం మిసానిపల్లి కార్యదర్శి సంతోష్, మాల్తుమ్మెద కార్యదర్శి నర్సింలు.మద్నూర్ మండలం పెద్ద తడగూర్ కు బదిలీ కాగా స్థానంలో లింగంపేట్ మండలం భావానిపేట్ కార్యదర్శి అశోక్. మెల్లకుంట తండా కార్యదర్శి సవాయ్ మద్నూర్ మండలం డోంగ్లీ కి బదిలీ ఆ స్థానంలో ఎల్లారెడ్డి మండలం అల్మాజీపూర్ కార్యదర్శి పవిత్ర. జప్తి జానకంపల్లి కార్యదర్శి ప్రదీపకుమార్ ఎల్లారెడ్డి మండలం మత్తమాల కు బదిలీ కాగా ఆ స్థానంలో ఎల్లారెడ్డి మండలం బ్రహ్మాన్ పల్లి కార్యదర్శి శంకర్. పల్లె బోగుడతాండ కార్యదర్శి సునంద బదిలీపై ఎల్లారెడ్డి మండలం సబ్దల్ పూర్ కు బదిలీ కాగా,ఆ స్థానంలో అక్కడి నుండే సుజాత. రాఘవ పల్లి కార్యదర్శి కృష్ణ మూర్తి ఎల్లారెడ్డి మండలం మాచాపూర్ కు బదిలీ కాగా ఆ స్థానంలో గాంధారి మండలంలోని బ్రహ్మాన్ పల్లి కార్యదర్శి జానకి రాగా ప్రస్తుతం మెటర్నిటీ లీవ్ లో ఉంది.వెంకంపల్లి కార్యదర్శి ప్రియాంక బదిలీ కాగా ఆ స్థానంలో లింగంపేట్ మండలం అయ్యపల్లి కార్యదర్శి రజిత ధర్మారెడ్డి కార్యదర్శి సత్యనారాయణ మెదక్ జిల్లాకు బదిలీ కాగా వారి స్థానంలో బంజారా కార్యదర్శి మమతకు అదనపు బాధ్యతలు అప్పగించారు. గోలి లింగాల కార్యదర్శి గంగాధర్ మెడికల్ లీవ్ పై వెళ్లగా కార్యదర్శి తిరుపతి కి అదనపు బాధ్యతలు అప్పగించినట్టు ఎంపీడీవో పర్బన్న తెలిపారు. కాగా ఎంపీడీవో కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ వెంకట్ రామ్ రెడ్డి బిచ్కుంద కు బదిలీ కాగా ఆ స్థానంలో మద్నూర్ ఎంపీడీఓ కార్యాలయం నుంచి ప్రకాష్ చేరారని ఓఎస్ మానెమ్మ ఎల్లారెడ్డి ఎంపీడీవో కార్యాలయానికి బదిలీ కాగ ఆ స్థానంలో అక్కడి నుండే వెంకటేశ్వర్లు ఇక్కడ చేరారని ఎంపీడీవో పర్బన్న తెలిపారు.

## ప్రతిపక్షాలు ఆరోపణలు మానుకోవాలి

**కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గిరెడ్డి మహేందర్ రెడ్డి**



కామారెడ్డి జిల్లా / రామారెడ్డి జూలై 22 (లోకంతీరు)రుణమాఫీ విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు మానుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గీరేడ్డి మహేందర్ రేడ్డి అన్నారు. సోమవారం మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా రెండు లక్షల రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. దీనిని ఓరువలేక ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రైతుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఇట్టి విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ఉంచినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

## స్పా సెంటర్లలో యవ్వారం

ఒంగోలు, జూలై 22 బయటేమో స్పా, మస్సాజ్ సెంటర్ల బోర్డులు.. లోపలేమో యవ్వారం వేరే.. తనిఖీలకు వెళ్లిన పోలీసులు బిత్తరపోయారు.. ప్రకాశం జిల్లా ఎస్పిగా నాలుగురోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన దామోదర్ అసాంఘిక కార్యక్రమాలపై తనదైన స్టైల్లో దృష్టి పెట్టారు.. ఒంగోలులో మసాజ్ సెంటర్లపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. దీంతో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.. ఒంగోలు నగరంలో మసాజ్ సెంటర్లు, స్పా క్లినిక్‌ల పేరుతో యువతులతో యువకులకు క్రాస్ జెండర్ మసాజ్‌లు చేస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి.. దీంతో మొత్తం 16 స్పా సెంటర్లపై ఏకకాలంలో దాడులు చేయాలని ఎస్పి దామోదర్ పోలీసు సిబ్బందిని అదేశించారు. ఎస్పి ఆదేశాల మేరకు బృందాలుగా విడిపోయిన పోలీసులు నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో నడుపుతున్న స్పా సెంటర్లపై ఏకకాలంలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో పలు స్పా సెంటర్లలో యువకులకు యువతులు మసాజ్ చేస్తున్నట్టు గుర్తించారు. పలు సెంటర్లలో యువతీయువకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు.మరోవైపు స్పా సెంటర్ల పేరుతో క్రాస్ జెండర్ మసాజ్ చేస్తున్న కొన్ని పార్లర్లలో యువకులను ఆధునాతమైన లైటింగ్‌లు, ఏసీలు ఏర్పాటు చేయడాన్ని చూసిన పోలీసులు బిత్తరపోయారు.

## ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

**- కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



కామారెడ్డి జిల్లా జూలై 22(లోకంతీరు):కామారెడ్డి లో కలెక్టరేట్లో ప్రజావాణి కార్యక్రమంలో 91 ఫిర్యాదులు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యా దులను ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదులను శాఖల వారీగా పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డిఆర్ డిఓ చందర్, డిపిఓ శ్రీనివాసరావు, సిపిఓ రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గాంధారి మండల అధికారికి సన్మానం



లోకంతీరు కామారెడ్డి జిల్లా జూలై 22కామారెడ్డి జిల్లా గాంధారి మండలానికి నూతన మండల అభివృద్ధి అధికారి రాజేశ్వర్ కు మర్యాద పూర్వకంగా శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జువ్వాడి వినయ్ కుమార్ , ఎన్ ఎస్ యు ఐ మండల ఉపాధ్యక్షులు గుర్రం మోహన్ పాల్గొన్నారు.

## మండల పనులు తొందరగా చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కు వినతి



లోకంతీరు కామారెడ్డి జిల్లా రాజంపేట జూలై 22జిల్లాలోని రాజంపేట కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి సోమవారం ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావును కలిశారు. ఈ సందర్భంగా మండలంలో పలు గ్రామాలలో డ్రైనేజి, రోడ్డు సమస్యలు , పాఠశాల బిల్డింగ్ సమస్యలు త్వరగా పూర్తి చేయాలని మదన్ మోహన్ రావుకు విన్నవించారు. అనంతరం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే వెంటనే స్పందించి పనులు తొందరగా చేయిస్తానని హామీ ఇచ్చారు

# రైతు భీమాకు దరఖాస్తు చేసుకోవాలి

**మండల రైతు బంధు సమితి మాజీ అధ్యక్షులు నాగరాజ్ గౌడ్**



కామారెడ్డి జూలై 22(లోకంతీరు):జిల్లాలోని బీబీపేట్ మండలంలో జూన్ 28 వ తేదీ వరకు నూతనంగా పట్టా పాస్ బుక్ పొందిన రైతులు 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల లోపు వయస్సు కల రైతులు భీమాకు అర్హులని వారు 2024-25 సంవత్సరంకు భీమా ధరఖాస్తు చేసుకోవాలని మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమా నమోదు చేసుకున్న రైతు మరణిస్తే, రైతు కుటుంబానికి ప్రభుత్వం ఐదు లక్షల రూపాయల భీమా ఇవ్వడం జరుగుతుందన్నారు.ఒక్క గుంట నుంచి ఎన్ని ఎకరాలు ఉన్న రైతు అయినా ప్రమాదవశాత్తు, ఇతర కారణాల వల్ల మరణించిన రైతు కుటుంబాలు ఆగం కావద్దని వారిని ఆర్థికంగా అదుకునే ఉద్దేశంతో వారి సంక్షేమం కోసం లబ్ధి చేకూరుస్తూన్న రైతు భీమా పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం యధావిధిగా కొనసాగించడం హర్షణియమన్నారు. రైతులు భీమా దరఖాస్తు ఫారం నింపి దానితో పాటు నూతనంగా వచ్చిన పట్టా పాస్ బుక్, రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు, ఒకవేళ నామిని 18 సంవత్సరాలకు తక్కువగా ఉన్నచో అపాయింటీ ఆధార్ కార్డు, ఆయా ధృవపత్రాల జిరాక్సులు భీమా ఫారం తో ఆగస్టు 5 తేదీ లోపు జత చేసి క్లస్టర్ పరిధిలోని రైతు వేదికల్లో సంబంధిత ఏఈవోలకు నేరుగా రైతులు అందించాలని ఆయన కోరారు. గతంలో నమోదు చేసుకున్న రైతుల భీమా యదావిధిగా కొనసాగుతుందన్నారు. ఒకవేళ నామిని పేర్లలో మార్పులకు అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఒక లక్ష వరకు రుణమాఫీ చేసి రైతుల కుటుంబాల్లో వెలుగు నింపిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. రైతు కుటుంబాలకు దీమా కల్పించేందుకు రైతు బీమా పథకాన్ని యధావిధిగా కొనసాగిస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి వర్గానికి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ కి రైతాంగం ఎల్లవేళలా రుణపడి వుంటుందని రైతుల పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు

# ప్రజావాణికి 91 ఫిర్యాదులు







నిజామాబాద్,జూలై 22 (లోకంతీరు) : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 91 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, డీఆర్డీఓ సాయాగౌడ్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డెంగ్యూ వ్యాధితో బాధపడుతున్న మహిళకు ఓ నెగిటివ్ ప్లేట్ లెట్స్ ను అందజేత

**- ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు**





కామారెడ్డి జిల్లా జూలై 22 (లోకంతీరు):కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన చిట్టి మల్లె సౌమ్య (28) డెంగ్యూ వ్యాధితో పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అత్యవసరంగా ప్లేట్ లెట్స్ అవసరమని డాక్టర్లు సూచించడంతో వారికి కావలసిన ప్లేట్ లెట్స్ ను కామారెడ్డి రక్తదాతల సమూహ ఉపాధ్యక్షుడు కిరణ్ నిజామాబాద్ వెళ్లి అందజేసారు. ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్లాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి వచ్చినప్పుడు కావాల్సిన ప్లేట్లెట్స్ దొరకగా పేషెంట్లు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కోవడం జరుగుతుందని, ప్లేట్ లెట్స్ ఇవ్వడం వలన ఎలాంటి బలహీనతలు రావడం జరగదని, దీనిపట్ల ఉన్న అపోహలను విడనాడాలని అన్నారు.గత సంవత్సరం కూడా ఆపదలో ఉన్న వారికి కావలసిన ప్లేట్ లెట్స్ ను అందజేసారు. 56వ సారి రక్తదానానికి ముందుకొచ్చిన కిరణ్ కు ఐవిఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ రాజన్నల తరపున అభినందనలు తెలియజేశారు. కిరణ్ స్ఫూర్తిగా తీసుకొని రక్తదానానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని అన్నారు.

# నిజామాబాద్ లో అమ్మో...కుక్కలు

నిజామాబాద్, జూలై 22 (న్యూస్ పల్స్)ఒక్క జూన్ నెలలోనే 435 కేసులు.. ఈ నెలలో ఇప్పటివరకు 243.. గత ఆరు నెలలుగా 300కు పైగానే.. సగటున రోజుకు 10 మంది ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కుక్కల దాడిలో గాయపడుతున్నారు. పల్లె, పట్టణమన్న తేడా లేకుండా వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆకలి మంటతో జనం మీద దాడి చేస్తున్నాయి. వాటి పునరుత్పత్తి సీజన్లో డాగ్బైట్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి.వాటి పిల్లలను కాపాడుకునే ప్రయత్నంలో దగ్గరగా నడుచుకుంటూ వెళ్లేవారిని ఎటాక్ చేస్తున్నాయి. బండ్లపై వెళ్లే వారిని, ఇంటి బయట ఆడుకుంటున్న పిల్లలను వదలట్లేదు. అసలు ఎటు నుంచి వచ్చి కుక్కలు దాడులు దాడి చేస్తున్నాయో తెలియక ప్రజలు రోడ్డు ఎక్కాలంటేనే భయపడుతున్నారు. డాగ్ బైట్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో గవర్నమెంట్ ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. నగరంలోని ఎనిమల్ బెర్త్ కంట్రోల్ రూమ్ బాధ్యతలు పెంచింది. వీధి కుక్కల సమాచారం తెలపడానికి 08462-220234 నంబర్ను పౌరుల కోసం అందుబాటులో తెచ్చినట్లు నగర పాలక కమిషనర్ మంద మకరంద్ తెలిపారు. సమాచారం అందిస్తే వీధి కుక్కలను పట్టుకొని సంతానోత్పత్తిలేకుండా ఆపరేషన్ చేయిస్తామని, వాటి కోపాన్ని తగ్గించే ట్రీట్మెంట్ను వెటర్నరీ డాక్టర్లు ఇస్తారని వివరించారు. ఇందుకోసం మూడు టీమ్లను వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు మేయర్ నీతూకిరణ్ వెల్లడించారు.నిజామాబాద్లోని ఆటో నగర్లో నెల కింద ఇంటి బయట ఏడాది కొడుకుతో కూర్చున్న తల్లి జరీనా.. పాలబాటిల్ కోసం లోపలికి వెళ్లొచ్చే నిమిషం వ్యవధిలో చిన్నారిపై కుక్క దాడి చేసింది. మాక్లూర్లో ఈ నెల 17న మూడేండ్ల పిల్లాడిని కుక్క తీవ్రంగా గాయపర్చింది. ఇంటి బయట ఆడుకుంటుండగా, ఇష్టమొచ్చినట్టు కొరికింది. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం రామేశ్వర్పల్లి శివారులో ఈ నెల 3న రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఏడుగురు వ్యక్తులపై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. అంతకు కొన్ని రోజుల ముందు తాడ్వాయి మండలం సోమారం తండాలో ఇంటి బయట ఆడుకుంటున్న ఏడేళ్ల బాలిక శైలజపై కుక్క దాడి చేసింది.

## జీవో 317పై కేబినెట్ సబ్ కమిటీ భేటీ.. సమాచారం ఇవ్వాలని మంత్రి ఆదేశం



హైదరాబాద్ జూలై 22 ,జీవో 317పై మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సచివాలయంలో సమావేశమైంది. కమిటీ సభ్యులు, మంత్రులు శ్రీధర్బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. సమావేశంలో తొమ్మిది ప్రభుత్వ శాఖలపై చర్చించారు. వివిధ శాఖల అధికారులు శాఖలపరంగా పూర్తి సమాచారం ఇవ్వనందున యుద్ధ ప్రాతిపదికన పూర్తి సమాచారం ఇవ్వాల్సిందిగా మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. కమిటీ సమావేశంలో పలు అంశాలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేయడం జరిగిందని తెలిపారు. పాత జిల్లాల వారీగా ఉద్యోగుల సర్వీస్, ప్రమోషన్ అంశాలను పరిగణలోకి తీసుకొని 317 జీవోను పరిష్కరించాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది.సబ్ కమిటీ సమావేశంలో వివిధశాఖల ఉన్నతాధికారులు నవీన్ మిట్టల్, మహేశ్ కుమార్ ఎక్కా దత్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్తా, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ శ్రీనివాసరావు, అడిషనల్ డీజీ షికా గోయల్, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శరత్, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన, ఇంటర్మీడియట్ బోర్డ్ డైరెక్టర్ శృతి ఓజా, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిని, సోషల్ వెల్ఫేర్ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆయుష్ డైరెక్టర్ ప్రశాంతి, ప్రాథమిక విద్యాశాఖ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, వైద్యారోగ్యశాఖ, జీఏడీ ఉన్నతాధికారులు వినయ్ కృష్ణారెడ్డి, బూసని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ వాగుకు వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలి

## మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

కామారెడ్డి జిల్లా రామారెడ్డి (లోకంతీరు) జూలై 22కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలోని గంగమ్మ వాగుపై బిఆర్ఎస్ నాయకులు వాగు వద్ద, సాగుతున్న నత్తనడకన కార్యక్రమాలను పరిశీలించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా, లేక ప్రభుత్వం నుండి నిధులు యధావిధిగా రావడం లేదా, ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో విడిచిపాను మొదలుపెట్టి గత ఆరు నెలలు దాటిన పూర్తికాని బ్రిడ్జి నిర్మాణ పనులు, వీటిపై ప్రతిపక్ష నాయకులు స్పందిస్తూ నిరసన కార్యక్రమాన్ని వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతూ ఆదివారం కురిసిన భారీ వర్షానికి వాగులు వంకలు పొంగిపొర్లాయి. చెరువుల్లోకి, కుంట్ల లోకి నీరు చేరింది. గంగమ్మ వాగు వద్ద వాహనాలు వెళ్లడానికి ప్రమాదంగా ఉండడంతో ఎస్ ఐ విజయ్ ఆధ్వర్యంలో రోడ్డును బ్లాక్ చేశారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పనులు నత్త నడకన నిర్వహిస్తున్నారని, వాగు ఉధృతంగా పారడం తో, మండల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అసంపూర్తిగా నిర్మించిన బ్రిడ్జి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దశరథ్ రెడ్డి మాట్లాడుతూ...! కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్న పనులు నత్తనడకన నడుస్తున్నాయని, ఆర్అండ్ బి అధికారులు, ఎమ్మెల్యే స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని, గత ప్రభుత్వంలో




మంజూరైన పనులను నిర్వహించలేని చేతగాని ప్రభుత్వం, అసమర్థత ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టకపోతే ఆర్అండ్ బి, ఎమ్మెల్యే కార్యాలయాలను ముట్టడించడానికి



కూడా వెనుకాడమని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గురిజాల నారాయణరెడ్డి, పడిగెల శ్రీనివాస్, ఉప్పల్వాయి మాజీ సర్పంచ్ గంగారం, బొమ్మిడి రామ్ రెడ్డి, గొల్లపల్లి బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రెడ్డి మల్లేష్, జంగం లింగం, కన్నాపూర్ మాజీ సర్పంచ్ రాజనర్సు, పోతు నూరి ప్రసాద్,కూడెల్లి బాలరాజు, పాల మల్లేష్, లింగాపురం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# సినిమా తీరు

## ఆ లెక్కన శ్రీకాంత్ కూడా 100కోట్ల క్లబ్ హీరో



సినిమాలను చూడటానికి థియేటర్లకు వెళితే ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఒక్కోసారి టిక్కెట్ల ధర రూ.1000 వరకు పలుకుతోంది. ఈరోజు సినిమా టికెట్ కనీస ధర రూ.300. ఈ ధరను పరిగణనలోకి తీసుకుంటే కుటుంబ సభ్యులను థియేటర్లకు తీసుకెళ్తే రూ.1500-2000 వరకు కనీసంగా ఖర్చవుతుంది. మీరు సింగిల్ స్క్రీన్ థియేటర్‌కి వెళ్లాలని కూడా ఆలోచిస్తే, టిక్కెట్ల ధర కూడా రూ. 200 కంటే తక్కువ కాదు. ఫలితంగా ఈ రోజుల్లో చాలా మంది థియేటర్‌లను సందర్శించడం మానేస్తున్నారు. అంతేకాకుండా ఌు రాకతో ప్రజలు తమ ఇళ్లలో కూర్చొని సినిమాలు చూడటానికి ఇష్టపడుతున్నారు. ఈ మధ్యకాలంలో దర్శకనిర్మాతలను ఆందోళనకు గురిచేసే అంశంగా మారిన చాలా చిత్రాలకు బాక్సాఫీస్ వద్ద కలెక్షన్లు తగ్గడం మనం చూశాం. ఖాన్‌లను వెనక్కి నెట్టి ప్రభాస్ నం.1 స్థానంలో కానీ టికెట్ రేటు విషయంలో ఎలాంటి టెన్షన్ లేని ఒక దశ భారతీయ సినీపరిశ్రమలో ఉంది. అప్పట్లో తెలుగు సినిమా టికెట్ ధర సామాన్యులకు సైతం అందుబాటులో ఉండేది. వినోదం అందని ద్రాక్ష కాదు. ఇంతకుముందు టిక్కెట్లు రూ.5 నుండి ప్రారంభమయ్యేవి. ఇంత తక్కువ ధరకే టికెట్లు పెట్టి భారీ విజయం సాధించిన సినిమా ఒకటి ఉంది. ఈ సినిమా గురించి మరింత వివరంగా తెలుసుకుంటే ఆసక్తి కలగకుండా ఉండదు. ఆ చిత్రం- పెళ్లి సందడి. కె.రాఘవేంద్రరావు దర్శకత్వం వహించిన ఈ చిత్రం 1996లో విడుదలైంది. ఈ చిత్రం రూ. 11 కోట్లకు పైగా వసూలు చేసింది. అయితే ఈ చిత్రం థియేటర్ టిక్కెట్లు కేవలం రూ. 5 నుండి ప్రారంభమయ్యాయి. కొన్ని థియేటర్లలో టిక్కెట్ల ధర రూ. 30 వరకు ఉంది. నేటి ధరలతో పోలిస్తే ధర ఇప్పటికీ చాలా చౌకగా కనిపిస్తోంది. 1.5 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. అప్పట్లో అది పెద్ద హిట్. థియేటర్లలో సినిమా చూసేందుకు ప్రేక్షకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఇప్పటి రేటుతో పోల్చితే పెళ్లి సందడి 100 కోట్ల క్లబ్ రేంజ్ లో ఆడింది. శతాధిక చిత్రాల శ్రీకాంత్ ని కూడా సోలోగా వంద కోట్ల క్లబ్ హీరోగానే చూడాలి. పెళ్లి సందడి చిత్రానికి ప్రముఖ దర్శకుడు కె రాఘవేంద్రరావు దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో శ్రీకాంత్, రవళి, దీప్తి భట్నాగర్, తనికెళ్ల భరణి, బ్రహ్మానందం, రాజా రవీంద్ర, కైకాల సత్యనారాయణ, బాబు మోహన్ వంటి ప్రముఖ నటీనటులు నటించారు. దీనిని అల్లు అరవింద్ నిర్మించగా, ఎమ్‌ఎమ్ కీరవాణి సంగీతం అందించారు. ఈ చిత్రం ఐదు నంది అవార్డులు గెలుచుకుంది. ఉత్తమ సంగీతం –తెలుగు కేటగిరీలో ఫిల్మ్‌ఫేర్ అవార్డును అందుకుంది. ఈ చిత్రం తరువాత హిందీలో రీమేక్ అయింది. 1997లో 'మేరే సప్నో కి రాణి' అనే పేరు పెట్టి రీమేక్ చేసారు.

## ఖాన్‌లను వెనక్కి నెట్టి ప్రభాస్ నం.1 స్థానంలో

భారతదేశంలో గొప్ప ప్రజాదరణ పొందుతున్న స్టార్ ఎవరో సర్వేలు నిర్ధారిస్తున్నాయి. తాజాగా అందిన రిపోర్ట్ ప్రకారం ప్రభాస్ దేశంలో నంబర్-1 స్టార్ గా రికార్డులకెక్కారు. జూన్ నెలలో ఓర్మాక్స్ మీడియా జాబితా ప్రకారం ఇటీవల అత్యంత ప్రజాదరణ పొందిన హీరోగా ప్రభాస్ జనాదరణ చార్టులలో అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఈ ఘనత అతని తాజా చిత్రం 'కల్కి 2898 ఏడీ' భారీ విజయంతో సాధ్యమైంది.ప్రభాస్ 2024 మే నెలలోను అగ్రస్థానంలో ఉన్నాడు. తాజా జాబితాలో ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ జాబితాలో బాలీవుడ్ సూపర్ స్టార్ షారుక్ ఖాన్ రెండవ స్థానంలో ఉన్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో అల్లు అర్జున్, ఎన్టీఆర్ వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో ఉండగా, రామ్ చరణ్ తొమ్మిదో స్థానంలో ఉన్నారు. కథానాయికల్లో ఆలియా భట్ అగ్రస్థానంలో ఉండగా, సమంత రూత్ ప్రభు, దీపికా పదుకొనే తర్వాతి స్థానాల్లో ఉన్నారు.తాజా రిపోర్ట్ ప్రజల్లో ప్రభాస్ విస్తృత ఆకర్షణ, ప్రభావాన్ని ఎలివేట్ చేస్తోంది. కథానాయకుడిగా అతడికి ఉన్న ఆదరణ ఎలాంటిదో, ఛరిష్మా ఎలాంటిదో కూడా ఆవిష్కరిస్తోంది. జాతీయ స్థాయిలో ఖాన్‌ల త్రయం, కపూర్ లు, రోషన్‌లు ఒకప్పుడు అని కూడా నిరూపిస్తోంది.నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' ప్రభాస్ స్థాయిని అమాంతం పెంచింది. రాజమౌళి తర్వాత ఈ ఘనత నాగ్ అశ్విన్ కే దక్కుతుంది. రాజమౌళి తర్వాత ప్రభాస్ ఎంపిక చేసుకున్న బెస్ట్ డైరెక్టర్ కూడా నాగ్ అశ్విన్ అని చెప్పాలి. మధ్యలో ప్రశాంత్ నీల్ కూడా సలార్ తో అతడి స్థాయిని



పెంచాడు.కల్కి చిత్రం బాక్సాఫీస్ వద్ద పలు రికార్డులను బద్దలు కొట్టి రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరింది. 12.15 మిలియన్లకు పైగా టిక్కెట్లు అమ్ముడవడంతో ఈ చిత్రం టిక్కెట్ల విక్రయాల్లో షారుఖ్ ఖాన్ 'జవాన్'ను అధిగమించింది. కల్కి చిత్రం పెద్ద సంఖ్యలో ప్రేక్షకులను ఆకర్షిస్తుంది. అనేక షోల టికెట్లు వేగంగా అమ్ముడయ్యాయి. ప్రభాస్ స్టార్ డమ్ అంతకంతకు పెరుగుతోందని కల్కి విజయం మరోసారి నిరూపించింది.

## నేషనల్ క్రష్.. అభిమానులు ఇచ్చిన ట్యాగ్



విపరీతంగా పెరిగింది. దీంతో ఆమె నేషనల్ క్రష్‌గా గుర్తింపు సొంతం చేసుకున్నారు. అభిమానులు తనని 'నేషనల్ క్రష్' అని పిలవడంపై తాజాగా త్రిప్తి స్పందించారు. ఆ ట్యాగ్ విషయంలో తాను ఆనందంగా ఉన్నట్లు చెప్పారు. బాలీవుడ్‌లో కెరీర్ మొదలుపెట్టి దాదాపు ఏడేళ్లు అయ్యింది. అందుకు సంతోషంగా ఉన్నా. గొప్ప నటీనటులు, దర్శకులతో వర్క్ చేస్తానని కెరీర్ ఆరంభంలో ఎప్పుడూ అనుకోలేదు. ఎందుకంటే, యాక్టింగ్‌ను నేను సీరియస్‌గా తీసుకోలేదు. మొదటి సినిమా పూర్తైన తర్వాత కెరీర్‌ను విధికే వదిలేశా. 'ఒక సినిమా పూర్తి చేశా. అదృష్టం ఉంటే రెండో సినిమా రావొచ్చు' అనుకున్నా. అలాంటి సమయంలో లైలా మజ్ను' కోసం ఆడిషన్‌లో పాల్గొన్నా. ఆనాటి నుంచి యాక్టింగ్‌పై దృష్టిపెట్టా. నటనలో శిక్షణ తీసుకొన్నా. ప్రేక్షకులు నా నటనతో కనెక్ట్ అవుతున్నారు. నేషనల్ క్రష్ అనేది నా దృష్టిలో ట్యాగ్ మాత్రమే కాదు. అభిమానుల ప్రేమ. వాళ్లు నన్ను అలా పిలుస్తున్నందుకు ఆనందంగా ఉన్నా. ఇది నాపై మరింత బాధ్యత పెంచింది.

## అందానికే మరో అందం....






## కోహ్లీ, రోహిత్ భవిష్యత్‌పై గంభీర్ కీలక వ్యాఖ్యలు.. ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఏమన్నాడంటే?



టీమిండియా ఎఅఅ ఎ20 ప్రపంచ కప్ 2024 గెలిచిన తర్వాత, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ అంతర్జాతీయ స్థాయిలో పొట్టి ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించారు.రాబోయే కాలంలో టీమిండియా 2025లో ఛాంపియన్స్ ట్రోఫీతో పాటు 2027లో వన్డే ప్రపంచకప్ ఆడనుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఇద్దరు ఆటగాళ్లు ఎన్ని రోజులు ఆడతారు, వీరి విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ ఆలోచనేంటి అన్నది కూడా చర్చనీయాంశమవుతోంది. అదే సమయంలో వీరికి సంబంధించి టీమ్ ఇండియా కొత్త హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్లాన్ ఏమిటనే విషయం ఇప్పుడు వెల్లడైంది. ఈ ఇద్దరు ఆటగాళ్లు తదుపరి వన్డే ప్రపంచకప్‌లో కూడా ఆడటం చూడగలమంటూ గుడ్ న్యూస్ చెప్పుకొచ్చాడు.టీమ్ ఇండియా కొత్త ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తన మొదటి ప్రెస్ కాన్ఫరెన్స్‌లోనే ఈ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్ల భవిష్యత్తు గురించి ప్రశ్నించారు. ఈ మేరకు గౌతీ స్పందిస్తూ.. 'విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఇద్దరిలో ఇంకా చాలా క్రికెట్ మిగిలి ఉంది. వారు ప్రపంచ స్థాయి ఆటగాళ్ళు.. ఏ జట్టుకైనా ఇలాంటి వాళ్లు ఉండాలి. ప్రస్తుతం ఛాంపియన్స్ ట్రోఫీ, ఆస్ట్రేలియా సిరీస్ ఉంది. వారి ఫిట్‌నెస్ బాగా ఉంటే, వారు 2027 ప్రపంచ కప్ వరకు కూడా ఆడగలరు' అంటూ చెప్పుకొచ్చాడు.భారతదేశంలో, సీనియర్ ఆటగాళ్ళ భవిష్యత్తుపై తరచుగా ప్రశ్నలు తలెత్తుతాయని, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ విషయంలో కూడా అదే కనిపిస్తోంది. అయితే, వచ్చే ఏడాది జరిగే ఛాంపియన్స్ ట్రోఫీలో రోహిత్ బాధ్యతలు స్వీకరిస్తాడని ఇటీవల బీసీసీఐ సెక్రటరీ జైషా ప్రకటించారు. మరోవైపు విరాట్ ప్లేస్ కూడా ఇప్పుడు కన్ఫర్మ్ అయినట్లు తెలుస్తోంది. ఈ ఇద్దరు ఆటగాళ్లు ఒక దశాబ్దానికి పైగా టీమ్ ఇండియాను నడిపించారు. అయితే, 2027 ౦ాఅఎ ప్రపంచ కప్ నాటికి విరాట్‌కి 38, రోహిత్‌కి 40 ఏళ్లు రానున్నాయి.ఈ కారణంగా వీరిద్దరు తదుపరి వన్డే ప్రపంచ కప్‌లో ఆడటం గురించి ఇంకా ఏమీ నిర్ణయించలేదు. కానీ, ఇప్పుడు కోచ్ గౌతం గంభీర్ తన స్టాండ్‌ను స్పష్టం చేశాడు. వారిద్దరూ తమ ప్రదర్శనను కొనసాగించి, వారి ఫిట్‌నెస్ బాగుంటే 2027 వన్డే ప్రపంచకప్‌లో కూడా ఆడటం చూడవచ్చు అని గంభీర్ చెప్పుకొచ్చాడు. ఇలాంటి పరిస్థితుల్లో విరాట్, రోహిత్ అభిమానులకు ఓ శుభవార్త వచ్చింది.

## 'గోల్డెన్ బాయ్'కి గాయం.. కీలక అప్‌డేట్ ఇచ్చిన నీరజ్ చోప్రా కోచ్

తొడ నొప్పి కారణంగా నీరజ్ చోప్రా మేలో ఆస్ట్రావా గోల్డెన్ స్పైక్ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాడు. అతని నిర్ణయం పారిస్ ఒలింపిక్స్‌కు ముందు ఫిట్‌నెస్ విషయంలో అభిమానులలో టెన్షన్‌ను పెంచింది. ఈ క్రమంలో నీరజ్ జర్మన్ కోచ్ అతని గాయంపై కీలక అప్‌డేట్ ఇచ్చాడు. నీరజ్ చోప్రా జర్మన్ కోచ్ క్లాస్ బార్టోనిట్జ్ అతని ఫిట్‌నెస్ గురించి అన్ని ఆందోళనలను తోసిపుచ్చాడు. గత కొన్ని నెలలుగా నీరజ్‌ను ఇబ్బందిపెడుతున్న తొడ (అడక్టర్) గాయం ఇప్పుడు బాగానే ఉందని, అతను పారిస్ ఒలింపిక్స్ కోసం తీవ్రంగా సిద్ధమవుతున్నాడని చెప్పుకొచ్చాడు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించిన నీరజ్.. పారిస్‌లో టైటిల్ కోసం బలమైన పోటీదారుగా ఉన్నాడు. కానీ, అతని ఫిట్‌నెస్‌ను పరిశీలిస్తే, అతని సీజన్ పర్ఫెక్ట్‌గా లేదు. అయితే, ఇప్పుడు విషయాలు తిరిగి ట్రాక్‌లో ఉన్నాయని బార్టోనిట్జ్ తెలిపాడు.' అంతా ప్లాన్ ప్రకారం సాగుతోంది. ప్రస్తుతం తొడ గాయం సమస్య లేదు, బాగానే ఉంది. ఒలింపిక్స్ వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని ఆశిస్తున్నాం' అంటూ చెప్పుకొచ్చాడు.నీరజ్ చోప్రా తొడ నొప్పితో మేలో ఆస్ట్రావా గోల్డెన్ స్పైక్ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాడు.

## ఈ 8 రకాల పానీయాలలో ఏ ఒక్కటి తాగినా మీకు గాఢంగా నిద్రపడుతుంది





మనలో చాలా మంది నిద్ర లేమితో బాధపడుతున్నారు. ఒక వ్యక్తికి తగినంత నిద్ర రాకపోతే, అది అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. దీనికి ప్రధాన కారణం పేలవమైన జీవనశైలి మరియు ఒత్తిడి.మీరు నిద్ర సమస్యతో బాధపడుతూ, దానిని గమనించకుండా వదిలేస్తే, అది పెద్ద పరిణామాలను కలిగిస్తుంది. కాబట్టి మీకు నిద్రించడానికి ఇబ్బంది ఉంటే, దాన్ని పరిష్కరించడానికి ప్రయత్నించండి.నిద్ర ప్రాముఖ్యతను వైద్యులు మరియు ఆరోగ్య నిపుణులు మనకు నొక్కి చెబుతున్నా, చాలా తరచుగా మనం దానిపై రాజీ పడటం లేదు. అర్ధరాత్రి వరకు టీవీ చూడటం, మొబైల్ వాడటం, ఒత్తిడి, పని లేదా నిద్ర పట్టకపోవడం ఇలా అనేక కారణాల వల్ల చాలా మంది నిద్రలేమి సమస్యతో బాధపడుతుంటారు.రాత్రి సమయంలో మంచి నిద్ర పొందడానికి మీకు సహాయపడే కొన్ని పానీయాలు ఇక్కడ ఉన్నాయి. అదృష్టం కొద్దీ ఈ పానీయాలను సాధారణ పదార్థాలతో నిద్రకు సహాయపడే పానీయాలను తయారు చేయవచ్చు. కాబట్టి మీరు రాత్రి సమయంలో నిద్ర పట్టనప్పుడు ఈ పానియాల్లో ఏ ఒక్కదానిని త్రాగినా చాలు మీకు బాగా గాఢంగా నిద్ర పడుతుంది.వెచ్చని పాలువెచ్చని పాలునిద్రించడానికి ముందు గోరువెచ్చని పాలు త్రాగడం పురాతకాలం నుండి వస్తున్న సంప్రదాయం. ఇది మంచి నిద్రను పొందడానికి సహజమైన నివారణగా పనిచేస్తుంది. పాలలో ఉండే ట్రిప్టోఫాన్ అని పిలువబడే అమైనో ఆమ్లాన్ని కలిగి ఉంటుంది, పాలను త్రాగినప్పుడు ఇది మెలటోనిన్ అనే హార్మోన్‌గా మార్చబడుతుంది, ఇది మీ సహజ నిద్ర స్థితిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఒత్తిడి మరియు నిద్రలేమి వంటి నిద్ర రుగ్మతలను ఎదుర్కోవడం ద్వారా మెలటోనిన్ నిద్రను ప్రోత్సహిస్తుంది. పాలు వెచ్చగా ఉండటానికి కారణం అది గొంతు మరియు శరీరంలోని మిగిలిన భాగాలకు ఓదార్పునిస్తుంది.చమోమిలే టీచమోమిలే టీంటను తగ్గించడం మరియు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం వంటి ఆరోగ్య ప్రయోజనాల గురించి గొప్పగా చెప్పుకోవడమే కాకుండా, చమోమిలే టీ నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది. రోజూ చమోమిలే టీ తాగే వారు నిద్ర లోపం శారీరక లక్షణాలు గణనీయంగా మెరుగుపడ్డాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్లస్ పాయింట్ ఏమిటంటే, చాలా టీల మాదిరిగా కాకుండా, చమోమిలే టీ కెఫిన్ లేకుండా ఉంటుంది, ఇది ప్రశాంతమైన మరియు మరింత ఓదార్పు పానీయంగా మారుతుంది.కొబ్బరి నీళ్ళుకొబ్బరి నీళ్ళుకొబ్బరి నీరు మెగ్నీషియం మరియు పొటాషియం, కండరాలను సడలించే రెండు ఖనిజాలతో నిండి ఉంది. ఇది శరీరాన్ని శాంతవరచడంలో సహాయపడుతుంది మరియు సులభంగా మరియు సౌకర్యవంతమైన నిద్రను అనుమతిస్తుంది. అంతేకాక, కొబ్బరి నీటిలో విటమిన్ బి ఉంటుంది, ఇది ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తుంది.పుదీనా టీటీపిప్పరమింట్ టీలో ఉన్న మెంతోల్ యాంటిస్పాస్మోడిక్ స్వభావం శారీరక లేదా మానసిక ఒత్తిడికి గురైనప్పుడు మీ కండరాలు విశ్రాంతి తీసుకోవడానికి సహాయపడుతుంది. దీని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, ఇది రాత్రిపూట నిద్రకు ఆటంకం కలిగించే గౌట్ అసౌకర్యాన్ని తగ్గిస్తుంది. పొటాషియం మరియు విటమిన్ బి లు కూడా ఒత్తిడిని తగ్గించడానికి మరియు కండరాలను సడలించడానికి కూడా సహాయపడతాయి

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.